క్లుప్తంగా

ఇంటర్ పరీక్షల్లో ఐదుగురు డిబార్

కోసిగి: మండల కేంద్రం కోసిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల, నారాయణ డిగ్రీ కళాశాల కేంద్రాల్లో జరుగుతున్న ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ మురళీ మోహన్ తెలిపారు. మంగళవారం ఆయా కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష జరుగుతుండగా ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాపీ కొట్టేందుకు వెంట తెచ్చుకున్న చీటి దొరకడంతో నలుగురు విద్యార్థులు, నారాయణ కళాశాలలో ఒకరు దొరికట్లు తెలిపారు. వారిని డిబార్ చేసినట్లు అధికారి వెల్లడించారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్



పట్టుబడిన ఆటో, నిందితులను చూపుతున్న ఎస్ఐ మహేష్‌కుమార్

ఆదోని రూరల్: అక్రమంగా ఆటోలో కర్ణాటక మద్యం తరలిస్తున్న ఆర్లబండకు చెందిన వీరేష్, స్వామిలను అరెస్టు చేసినట్లు పెద్దతుంబళం ఎస్ఐ మహేష్‌కుమార్ మంగళవారం విలేకరులకు తెలిపారు. సదరు వ్యక్తుల నుంచి ఒక ఆటో, ఐదు బాక్సుల కర్ణాటక టెట్రా ప్యాకెట్లు (90 ఎం.ఎల్. పరిమాణం) స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలించినా, విక్రయించినా కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు.

నాటుసారాను నిర్మూలిద్దాం

కోసిగి : నాటుసారా నిర్మూలన కోసం అడుగులు ముందుకు వేద్దామని ఎక్సైజ్ సీఐ భార్గవ రెడ్డి పిలుపునిచ్చారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని దొడ్డిబెళగల్ గ్రామంలో మంగళవారం నాటుసారా రహిత సమాజ నిర్మాణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాటుసారా దుష్పలితాలపై అవగాహన కల్పించి, ప్రజలచేత ప్రతిజ్ఞ చేయించారు. ఎవరైనా సారా తయారు చేసినా, అమ్మినా 94409 02580 అను నెంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం చేరవేసిన వారి పేర్లును గోప్యంగా ఉంచుతామన్నారు.

ఏఐకేఎస్ జాతీయ మహాసభలకు ఎంపిక



కె.లక్ష్మారెడ్డి



బి. గోపాల్

ఆదోని రూరల్: ఈ ఏడాది ఏప్రిల్ 15, 16, 17వ తేదీల్లో తమిళనాడు రాష్ట్రం నాగపట్నంలో జరిగే ఏఐకేఎస్ జాతీయ మహాసభలకు కర్నూలు జిల్లా నుంచి 15 మంది ప్రతినిధులను ఎంపికచేశారు. ఇందులో ఆదోని ప్రాంతం నుంచి రైతు సంఘం జిల్లా నాయకులు బసాపురం గోపాల్, రైతు సంఘం సీనియర్ నాయకులు కె.లక్ష్మారెడ్డి ఎంపికయ్యారు.

బకాయి వేతనాలు చెల్లిస్తేనే వలసలు ఆగేది

పెద్దకడబూరు : బకాయి వేతనాలు చెల్లిస్తేనే కూలీల వలసలు ఆగే అవకాశం ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తిక్కన్న అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో గత 10 వారాలుగా వేతనాలు పెండింగ్‌లో ఉంటే కూలీలు ఎలా బతకాలని ప్రశ్నించారు. కూలీలకు మంచిగా పనులు కల్పించడంతో పాటు వారం వారం సకాలంలో వేతనాలు అందిస్తే వలసలు వెళ్లకుండా ఉంటారన్నారు. అనంతరం వినతిపత్రాన్ని ఎంపీడీఓ నాగరాజుస్వామి సమర్పించారు. శ్రీనివాసులు, రాముడు, కంబగిరి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంత్రాలయం : మండల పరిధిలోని రచ్చుమర్రి ఏపీ ఆదర్శ పాఠశాలలో 2025–2026 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె. ప్రసాద్ తెలిపారు. దరఖాస్తులు www.cse.ap.gov.in లేదా www.apms.ap.gov.in ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని రూరల్: ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆశాడే సందర్భంగా మంగళవారం పెద్దతుంబళం పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌కు ఆశావర్కర్లు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు నరసమ్మ, విశాలాక్షి, రాఘవేంద్రమ్మ, భాగ్యలక్ష్మి, నాగలక్ష్మి, తులసి తదితరులు పాల్గొన్నారు.

నందవరం : హాలహర్వి గ్రామంలోని పీహెచ్‌సీ ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం వినతి పత్రాన్ని పీహెచ్‌సీ డాక్టర్ విజయభారతికి అందజేశారు. సీఐటీయూ నియోజకవర్గ కార్యదర్శి రాముడు, రోజా, రమణి, సుశీల, శారద తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. గంగాభవాని రథోత్సవం



అశేష భక్తజనం మధ్య రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో గంగాభవాని అమ్మవారు,



రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్నతుంబళం పంచాయతీ మజర గ్రామమైన బాపురంలో వెలసిన గంగాభవాని అమ్మవారి రథోత్సవం మంగళవారం అత్యంత రమణీయంగా సాగింది. తెల్లవారుజాము నుంచి ఆలయ అర్చకులు అమ్మవారికి మహాగణపతిపూజ, గంగ పూజ, ఆకుపూజ, కుంకుమార్చన, తులసి అర్చన, పుష్పార్చన, పంచామృతాభిషేకము, మహామంగళ హారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల ఉన్న చిన్నతుంబళం, హాళికన్వి, బసలదొడ్డి, కల్లుకుంట, ముచ్చగిరి, నాగులాపురం, సింగరాజనహళ్లి తదితరు గ్రామాల నుంచి ప్రజలు పిండివంటలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా రథోత్సవం..

సాయంత్రం ముందుగా ఉప్పరి ఈరన్న ఇంటి నుంచి పూర్ణకుంభాన్ని మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి రథానికి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తిని, ఆలయ పీఠాధిపతులు బసవలింగమ్మ అవ్వను ఆలయం నుంచి రథం దగ్గరికి ఊరేగించి ప్రత్యేక పూజలు చేపట్టారు. గంగాభవాని ఉత్సవ మూర్తిని రథంపై అదిష్టించి మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, కరతాళ ధ్వనుల మధ్య ఆడపడుచులు కలశాలతో స్వాగతం పలుకుతుండగా రథం ముందుకు సాగింది. ఈ రథాన్ని తేరుబజారు నుంచి బసవన్న గుడివరకు లాగి యథాస్థానానికి చేర్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, రైతువిభాగం డివిజన్ అధ్యక్షుడు యల్లప్ప పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కర్ణాటక భక్తులు పాదయాత్ర

గంగాభవాని రథోత్సవాన్ని పురస్కరించుకొని కర్ణాటక రాష్ట్రం, రాయచూర్ జిల్లాకు చెందిన అమీన్‌గడ, పోత్‌నాళ్, ఆనూరు, మాన్వీ తదితర గ్రామాల భక్తులు రెండు రోజుల ముందు నుంచే బాపురం గ్రామానికి పాదయాత్రగా చేరుకున్నారు. వారు రథానికి మొక్కులు తీర్చుకున్నారు.



ఎర్రకోటలో స్వామి మహా రథాన్ని లాగుతున్న భక్తులు

వైభవంగా మహాలింగేశ్వరస్వామి రథోత్సవం

మండల పరిధిలోని ఎర్రకోట గ్రామంలో మంగళవారం సాయంత్రం మహాలింగేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. పీఠాధిపతులు మఠం లింగమూర్తి, హరిలింగమూర్తి, శంకరయ్య ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పల్లకీ వచ్చిన వెంటనే రథంపై స్వామిని అధిష్టింపజేసి ముందుకు లాగారు. రథోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ గొల్ల కేశన్నలు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసుల ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్త్ నిర్వహించారు.

– ఎమ్మిగనూరురూరల్

భ్రూణ హత్యలను సంపూర్ణంగా నివారిద్దాం



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: భ్రూణహత్యలను సంపూర్ణంగా నివారించేందుకు కృషి చేయాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పిలుపునిచ్చారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో భ్రూణ హత్యల నివారణ, పీసీపీఎన్‌డీటీ చట్టంపై డివిజన్‌లోని స్కానింగ్ నిర్వాహకులు, ప్రైవేట్, ప్రభుత్వ వైద్యాధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పులు తీసుకురావడం ద్వారానే భ్రూణ హత్యలను నివారించగలమన్నారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై రూ.50 వేలు జరిమానా నుంచి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందన్నారు. పీసీపీఎన్‌డీ చట్టం ప్రకారం స్కానింగ్ కేంద్రాలపై కచ్చితమైన సమాచారం అందించిన వారికి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు బహుమతి అందించే అవకాశం ఉందన్నారు. డివిజన్‌లో ఉన్న స్కానింగ్ కేంద్రాన్ని ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీ చేయాలన్నారు. డీఎస్పీ హేమలత మాట్లాడుతూ.. భారతదేశంలో పురుష–స్త్రీ నిష్పత్తి, అసమతుల్యతకు ప్రధాన కారణం భ్రూణ హత్యలేనన్నారు. ఇది భవిష్యత్ తరాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ నాగప్రసాద్, డెమో అధికారి శ్రీనివాసులు, డిప్యూటీ డెమో అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా మానిటరింగ్ కన్సల్టెంట్ అధికారి సుమలత తదితరులు పాల్గొన్నారు.

పీ4 సర్వే వేగవంతంగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్(సీపీఓ) హీమ ప్రభాకర్‌రాజు

నందవరం : గ్రామాల్లో చేపట్టిన పీ4 (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్, పార్టనర్‌షిప్) సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని సీపీఓ (చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్) హీమ ప్రభాకర్‌రాజు ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పుల్లయ్య ఆధ్వర్యంలో సీపీఓ, డీఎల్‌పీఓ రమణారెడ్డి పీ4 సర్వేపై మండల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం పీ4 సర్వేను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు 60 శాతం పూర్తి చేశారని, 100 శాతం పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. . కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, గణంకాల అధికారి సూర్యప్రకాష్, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ వేలాలు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలో పలు మార్కెట్ల వేలాలు నిర్వహించారు. వేలాల్లో గతేడాది కంటే ఈఏడాది రూ.6,76,500 అదనంగా మున్సిపాలిటీకి ఆదాయం దక్కింది. వేలంపాటలో డైలీ మార్కెట్‌ను కె.విద్యా రానెమ్మ రూ.30,35,000లకు దక్కించుకోగా, వారపు సంత మార్కెట్‌ను కేబీ.వీరన్న రూ.7,59,500, వారపు పశువుల మార్కెట్,గొర్రెల మార్కెట్‌ను కె.విద్యారాణెమ్మ రూ.17,15,000, రూ.17,20,000లకు దక్కించుకున్నారు. అదేవిధంగా గొర్రెల కమేలాను కె.హుస్సేని ఆలం రూ.1,42,000, మాంసం మార్కెట్‌ను ఖలీల్ బాషా రూ.1,47,000లకు వేలం పాటలో దక్కించుకున్నాడు. గతేడాది ఆయా వేలం పాటలో రూ.68,42,000 మున్సిపాలిటీకి ఆదాయం రాగా ఈ ఏడాది రూ.75,18,500లకు పెరగడంతో రూ.6,76,500 అదనపు ఆదాయం సమకూరినట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌ఓ అస్లాంబాషా, మేనేజర్ వరప్రసాద్, ఆర్‌ఐ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలంలో డ్రైనేజీ నిర్మించొద్దు



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కుర్ణిదైవాచారం సంఘ పెద్దలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కుర్ణి శ్మశాన వాటిక స్థలంలో డ్రైనేజీ నిర్మాణం చేపట్ట కుండా పక్కన నిర్మించాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంకే శివప్రసాద్ మున్సిపల్ అధికారులను కోరారు. మంగళవారం వారు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, కుర్ణి దైవాచార సంఘ పెద్దలతో కలిసి వారు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు.

బాలికల హైస్కూల్ వద్ద బంకులు తొలగించండి

పట్టణంలోని ఎంఎస్ బాలికల జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులకు ఇబ్బందికరంగా మారిన ప్రహరీకి ఆనుకొని ఉన్న బంకులను తొలగించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, కౌన్సిలర్లు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

ఆర్గానిక్ ప్యాడ్స్ వినియోగించాలి



అవగాహన కల్పిస్తున్న ఆర్‌డబ్ల్యూఎఫ్ సంస్థ మాస్టర్ ట్రైనర్

ఎమ్మిగనూరుటౌన్: మహిళలు రుతుస్రావ సమయంలో ఆర్గానిక్ ప్యాడ్స్ ఉపయోగించాలని ఆర్‌డబ్ల్యూఎఫ్ సంస్థ మాస్టర్ ట్రైనర్ సంధ్యారాణి సూచించారు. మంగళవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో 'నారీకి రక్ష– దేశ్‌కి సురక్ష' కార్యక్రమంలో భాగంగా పొదుపు మహిళలకు ఆర్గానిక్ శానిటరీ ప్యాడ్స్ ఉపయోగించడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మార్కెట్లలో లభించే వాణిజ్య శానిటరీ ప్యాడ్స్‌లో వాడే థాలెట్, ప్లాస్టిక్, రేయాన్, సెల్యులోజ్ జెల్‌తో పాటు ఇతర బ్లీచింగ్ రసాయన సింథటిక్ ఫైబర్లు మహిళల ఆరోగ్యాన్ని హరిస్తాయన్నారు. వీటిని ఉపయోగిస్తే మహిళలకు చర్మవ్యాధులు, అండాశయ, సర్వైకల్ వంటి క్యాన్సర్లు, థైరాయిడ్, హార్మోన్ ఇన్‌బ్యాలెన్స్ తదితర రుగ్మతల బారిన పడాల్సి వస్తుందని తెలిపారు. అలాగే వాణిజ్య శానిటరీ నాప్‌కిన్ భూమిలో కుళ్లి పోవడానికి వందల ఏళ్లు పట్టవచ్చని పలు అధ్యయనాలు తెలియజేస్తున్నాయన్నారు. ఆర్గానిక్ ప్యాడ్స్ మహిళల ఆరోగ్యాన్ని, వాతావరణాన్ని కాపాడుతాయన్నారు. సదస్సులో ఎస్ఎస్ఎస్ డివిజనల్ అధికారి జోనాథన్ విక్లీస్, మెప్మా సీఎంఎం జయవర్ధన్, సీఓ లలిత, సీనియర్ అసిస్టెంట్ ఉరుకుందమ్మ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలి

ఆదోని టౌన్: పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీ, ఎన్టీఆర్ నగర్ ఏరియాల్లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని బీజేపీ కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి ఆదూరి విజయకృష్ణ, ఆదోని పట్టణ నార్త్ విభాగం కార్యదర్శి వాల్మీకి చంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ కర్నూలు జిల్లా కార్యదర్శి రమాకాంత్, నార్త్ విభాగం ప్రధాన కార్యదర్శి వడ్డే రాము, ఉపాధ్యక్షులు, 2వ వార్డు కౌన్సిలర్ సురేష్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి తోడ్పాటునివ్వని రాష్ట్ర బడ్జెట్

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి తోడ్పడేలా రాష్ట్ర బడ్జెట్ లేదని ఎస్ఎస్‌యూవి జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి కూటమి ప్రభుత్వం 9.86 శాతం మాత్రమే నిధులను కేటాయించడం ఎంతవరకు సమంజసమన్నారు. కొఠారి కమిషన్ ప్రతిపాదించిన మేరకు విద్యారంగ అభివృద్ధికి బడ్జెట్‌లో 26శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్ విద్యావ్యవస్థను దగా చేసేలా వుందని ధ్వజమెత్తారు.

వివాహ వేడుకల్లో డీజేలకు అనుమతిలేదు

గోనెగండ్ల : పెళ్లి వేడుకల్లో భాగంగా జరుపుకునే ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ గంగాధర్ హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తక్కువ శబ్దం ఇచ్చే మైక్, డెక్కులను ఉపయోగించాలన్నా డీఎస్పీ అనుమతి తీసుకోవాలన్నారు. ఆ శబ్దం 70 డెసిబుల్స్ వరకు ఉండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

కౌతాళం: కౌతాళం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉరుకుంద గ్రామానికి చెందిన 9మందిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉరుకుంద గ్రామానికి చెందిన శాంతకుమార్ తన స్థలం సర్వే కోసం రెవెన్యూ అధికారులకు ఇటీవల అర్జి పెట్టుకున్నాడు. దీంతో రెవెన్యూ అధికారులు సర్వే చేసేందుకు గ్రామ వీఆర్‌ఓను పంపించారన్నారు. స్థలం వద్దకు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన గట్టూరి ఉసేని, గట్టూరి హరి మరో ఏడుగురు శాంతకుమార్‌ను కులం పేరుతో దూషించడమే కాక దాడికి పాల్పడ్డారని తెలిపారు. దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన వారిని కూడా కొట్టినట్లు బాధితుడు శాంతకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

నందవరం : వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు భూ సమగ్ర రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నదికై రవాడి గ్రామ సచివాలయంలో రీ సర్వేపై వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..మండలంలోని నదికై రవాడి గ్రామాన్ని రీ సర్వేలో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నామని, భూ సమస్యలు లేకుండా రైతుల సహకారంతో సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ మహేష్, మండల సర్వేయర్ అక్బర్‌బాషా, ఆర్ఐ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన ప్రభుత్వం

నందవరం : కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కి రైతులను మోసం చేసిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, పంటలు దిగుబడులు లేక తీవ్రంగా నష్టపోయారని, రైతులను ఆదుకోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, నాయకులు శాంతన్న, ముని, గాలెప్ప, ముని తదితరులు పాల్గొన్నారు.

పోసానిని వేధించడం తగదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: సినీ నటుడు పోసాని కృష్ణమురళీపై అక్రమ కేసులు బనాయించి, రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిప్పడం సబబుకాదని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. పార్టీ పరంగా ఏదైనా ఉన్నా కేసులు బనాయించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. మంగళవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదోని నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకుడు రేణువర్మ గతేడాది నవంబర్ మాసంలో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు పవన్‌కళ్యాణ్, నారా లోకేష్‌లపై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆదోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. రేణువర్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ నిమిత్తం మంగళవారం రాత్రి పోసాని మురళీకృష్ణను తీసుకురానున్నారని తెలిసిందన్నారు. అక్రమ కేసులు బనాయిస్తూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను వేధింపులకు గురి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. రాజకీయం చేయాలే తప్పా ఇలాంటి అడ్డదారుల్లో ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధిలో పోటీ పడాలే తప్పా ఇలాంటి అక్రమ మార్గాలను ఎంచుకోవడం వల్ల విలువలు కోల్పోతారన్నారు. రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తెలిపారు. పోసాని ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఇలా కేసుల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పడం సమంజసం కాదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, పట్టణాధ్యక్షులు దేవా, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలకల్ మునిస్వామి, తాయన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసుపై డీఎస్పీ విచారణ



గ్రామంలో విచారణ చేస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

కౌతాళం: కౌతాళం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చూడి గ్రామంలో ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామంలో చిన్నారిపై లైంగిక దాడి జరిగినట్లు పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడంతో జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో బాధితుల ఇంటికెళ్లి దర్యాప్తు చేపట్టారు. ఇంటి చుట్టూ పక్కల వారిని కూడా విచారించారు. ఈ సంఘటనపై అన్ని కోణాల్లో పూర్తిగా దర్యాప్తు చేపట్టి నివేదికను జిల్లా ఉన్నత అధికారులకు పంపుతామన్నారు. ఆయన వెంట సీఐ అశోక్‌కుమార్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

మార్చి చివరి వరకు ఎల్లెల్సీకి నీరు



గోనెగండ్లలో టేల్‌డ్యామ్ వద్ద నీటిని పరిశీలిస్తున్న ఎస్ఈ ద్వారకానాథ్ రెడ్డి

గోనెగండ్ల : మార్చి నెల చివరి వరకు ఎల్లెల్సీ ఆయకట్టుకు సాగునీరు విడుదల అవుతుందని జిల్లా నీటిపారుదల శాఖ ఎస్ఈ ద్వారకనాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా నీటిపారుదల శాఖ ఎస్ఈ ఇరిగేషన్ అధికారులతో కలిసి ఎమ్మిగనూరు మండలం గుడికల్ చెరువు నుంచి గోనెగండ్ల సెక్షన్ వరకు ఎల్లెల్సీ కాలువను సందర్శించారు. గోనెగండ్ల దగ్గర ఎస్కేప్ ఛానల్ ద్వారా ఎల్లెల్సీ నీటిని గాజులదిన్నె ప్రాజెక్టులోకి విడుదల చేయడాన్ని పరిశీలించారు. అలాగే టేల్ డ్యామ్, 4/7 కోడుమూరు సెక్షన్ బార్డర్‌లో ఉన్న కర్నూలు బ్రాంచ్ కెనాల్‌ను పరిశీలించారు. ఎక్కడెక్కడ కాలువ గట్లు దెబ్బతిన్నాయో దానికి సంబంధించిన పనులకు గాను ఎస్టిమేషన్ వేసి ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఎల్లెల్సీ కింద పంటలు సాగుచేసుకున్న రైతులకు నీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎస్ఈ బాలచందర్, ఎల్లెల్సీ డీఈ విద్యాసాగర్, జీడీపీ డీఈ విజయ్ కుమార్, ఎల్లెల్సీ ఏఈలు ఉదయ్ భాస్కర్, మణికంఠ, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో చోరీ



చోరీకి గురైన హుండీ తెరిచి ఉన్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం అర్ధరాత్రి ఆగంతకులు చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం దేవాలయానికి వచ్చిన పూజారి, భక్తులు గమనించి కమిటీ సభ్యులకు, పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. అర్ధరాత్రి దొంగలు దేవాలయంలోకి ప్రవేశించి సీసీ కెమెరాలు, హుండీలను ధ్వంసం చేసి అందులో ఉన్న కానుకలను ఎత్తుకెళ్లారు. గర్భగుడి ముందున్న హుండీని గత నెలలో అందరి సమక్షంలో లెక్కించామని, మరో హుండీలో కానులను లెక్కించలేదని దేవాలయ సమితి సభ్యులు చెపుతున్నారు. ఇప్పటి వరకు మూడు నాలుగు సార్లు కెమెరాలను ధ్వంసం చేశారని కమిటీ సభ్యులు చెప్పారు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బాల్య వివాహాలు చేయరాదు

ఆదోని టౌన్: చిన్న వయస్సులో బాలికలకు వివాహాలు చేయరాదని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వై.నాగప్రసాద్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హవన్నపేటలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి ఆధ్వర్యంలో చిన్నవయస్సులో బాలికలకు వివాహాలు చేయడం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చిన్నవయస్సులో వివాహాలు చేయడం వల్ల గర్భధారణ, టీనేజ్ ప్రెగ్నెన్సీ సమస్యలు ఏర్పడి ఇబ్బందులు పడతారన్నారు. అమ్మాయిలకు 18, అబ్బాయికి 21 సంవత్సరాల తరువాతే వివాహాలు చేయాలన్నారు.

బనవాసి కేవీకేలో 15వ సలహా సంఘం సమావేశం



మాట్లాడుతున్న ఎన్జీరంగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి ఆధ్వర్యంలో 15వ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల్లో వ్యవస్థాపకులను ప్రోత్సహించాలని, ఉత్పత్తులకు విలువలు జోడింపు ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. రైతులు రైతు ఉత్పత్తి సంఘాలుగా ఏర్పడి మార్కెటింగ్, రుణ సౌలభ్యం, క్రెడిట్ లింకేజ్ పొందవచ్చునని చెప్పారు. సమావేశంలో ప్రాంతీయ పరిశోధనా స్థానం నంద్యాల సహాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ జాన్సన్, జిల్లా ఉద్యాన అధికారి రామాంజినేయులు, జిల్లా మత్స్యశాఖ అధికారిణి శ్యామల, ఏడీఏలు మహమ్మద్ ఖాద్రి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.